

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం

25 సెప్టెంబర్ 2025 పేజీలు : 08


## జీఎస్టీ 2.0తో పేద, మధ్యతరగతి వర్గాలకు

# ఎంతో మేలు

### జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0తో పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో మేలు చేకూరనుందని, ఇది ఒక పొదుపు పండుగ అని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీసీ హాలులో జిఎస్టీ 2.0 సంస్కరణపై జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ.. జిఎస్టీ 2.0 వ్యవసాయం, పారిశ్రామిక, భవన నిర్మాణం, విద్యారంగం, వర్తక రంగాలకు ఎంతో ఊతమిస్తుందన్నారు. ప్రజలు వినియోగించే నిత్యావసరాలు, మెడిసిన్, వ్యసాయ పరికరాలు, భవన నిర్మాణ సామాగ్రి, ఆటోమొబైల్ రంగాల్లోని ఉత్పత్తులపై భారీగా జిఎస్టీ తగ్గిందన్నారు. దీంతో ధరలు తగ్గి అన్నివర్గాల ప్రజలకు ఆర్థికంగా ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రధానంగా సిమెంటు ధరలపై జిఎస్టీ 28శాతం నుంచి 18శాతానికి తగ్గడంతో భవన నిర్మాణ రంగం బలోపేతమవుతందన్నారు. నిత్యావసరాలు పూర్తిగా ప్రజలకు అందుబాటు ధరల్లో లభ్యమవుతాయన్నారు. విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలు,

-మిగతా 2లో




2లో..

## ఈవీఎం గోదాముల వద్ద పటిష్ట భద్రత

# చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల






### పెన్నానది పరిసరాలను శుభ్రపరిచిన

# ఎన్‌సీసీ క్యాడెట్లు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :**

ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకొని 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ నెల్లూరు లెఫ్ట్‌నెంట్ కమాండర్, కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గొదంగవే ఆదేశాల మేరకు ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్లు గుండాల నరేంద్రబాబు, చీరాల వెంకట నాగరాజు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్

-మిగతా 2లో

### స్వదేశీ వస్తువులనే వాడుదాం..

# స్థానిక వ్యాపారాన్ని అభివృద్ధి చేద్దాం

- మూడో రోజు జీఎస్టీ 2.0పై ప్రజలకు అవగాహన కల్పించిన టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి
- ప్రతి వస్తువుపై జీఎస్టీ తగ్గించడంతో స్థానికుల హర్షం
- నిత్యావసరాలు తగ్గి ప్రజలపై భారం తొలుగుతుందని వెల్లడి
- కూటమి ప్రభుత్వం ప్రజల కోసమే పనిచేస్తోంది

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :**



స్వదేశీ వస్తువులనే వాడి స్థానిక వ్యాపారాన్ని అభివృద్ధి చేద్దామని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారని టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి అన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం నగరంలోని పెద్దబజార్ ప్రాంతం డైకాస్ రోడ్డులో జీఎస్టీ 2.0పై వ్యాపారులకు, స్థానిక ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీ అంగళ్లు, బిరియానీ హొటళ్లకు, పండ్ల వ్యాపారుల వద్దకు వెళ్లి జీఎస్టీ 2.0 ద్వారా ప్రజలకు జరుగుతున్న లబ్ధిని వివరించారు. ప్రధాని మోదీ ఎంతో ఉన్నత ఆశయంతో పేద, మధ్య తరగతి ప్రజలకు దసరా కానుకగా దీన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. వైద్యపరంగా ఎంతో కీలకమైన ఔషధాల ధరలను కూడా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ నుంచి మినహాయించిందని



-మిగతా 2లో

## చంద్రగంట అలంకారంలో

# మానసాదేవి అమ్మవారు



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** వరికుంటపాడు మండల పరిధిలోని తూర్పు రొంపి దొడ్ల గ్రామంలో వెలసి ఉన్నటువంటి శ్రీ మానసాదేవి అమ్మవారి ఆలయంలో దసరా మహోత్సవాలలో భాగంగా బుధవారం మూడవరోజు అమ్మవారిని చంద్రగంట అలంకారంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అదేవిధంగా వరికుంటపాడులోని శ్రీ నాగర్పమ్మ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణ దేవి అలంకారంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేకపూజ కార్యక్రమాలు కుంకుమార్చన సహస్ర దీపాలంకరణ అర్చన అభిషేకాలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయానికి వచ్చినటువంటి భక్తులందరికీ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాలను పలు రకాల పుష్పాలతోనూ విద్యుత్ దీపాలతోనూ సుందరంగా అలంకరించారు.

# జీఎస్టీ 2.0తో పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో మేలు

*(మొదటి పేజీ తరువాయి)*

నోట్‌పుస్తకాలు, పెన్నులు ఇతర సామాగ్రిపై జీఎస్టీ తగ్గడంతో తల్లిదండ్రులకు ఊరట కలుగుతుందన్నారు. ఇలా అన్నిరకాలకు జీఎస్టీ 2.0తో ప్రయోజనాలు మెండుగా ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. రాష్ట్రంలో 8వేల కోట్ల రూపాయల మేర ప్రజలకు లబ్ధి చేకూరనున్నట్లు చెప్పారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో స్వదేశీ వస్తువుల ఉత్పత్తి, వినియోగం పెరుగుతుందని, తద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరి సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

### ప్రతి ఇంటికి జీఎస్టీ ఫలాలు చేరేలా నెలరోజులపాటు అవగాహనా కార్యక్రమాలు

జిల్లాలోని ప్రజలందరికి జీఎస్టీ 2.0 వలన కలిగే ప్రయోజనాలను వివరించేందుకు నెలరోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్ల చెప్పారు. ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు ఇంటింటికి జీఎస్టీ ఫలాల పేరుతో తగ్గిన నిత్యావసర వస్తువుల వివరాలకు, కలుగుతున్న ప్రయోజనాలను ప్రతి ఇంటికి వివరించనున్నట్లు చెప్పారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో కలిగే ప్రయోజనాలను ఈనెల 30 నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు, మానవ వనరుల అభివృద్ధి మరియు డిజిటల్ సాధికారతపై అక్టోబర్ 7 నుంచి అక్టోబర్ 13వ తేదీ వరకు, వికాస్ విశ్వాస్ – నమ్మకమైన అభివృద్ధిపై అక్టోబర్ 14 నుంచి 18వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ చెప్పారు. అక్టోబర్ 19న జీఎస్టీ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపునిచ్చారు.

### జీఎస్టీ సేవలు మరింత సులభం : జాయింట్ కమిషనర్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి జీఎస్టీ 2.0 వలన పన్నుల తగ్గింపుతో పాటు జీఎస్టీ రిజిస్ట్రేషన్, రీఫండ్, జీఎస్టీ వివాదాల పరిష్కారం వంటి సేవలు చాలా సులభతరమైనట్లు జాయింట్ కమిషనర్ కిరణ్ కుమార్ చెప్పారు. జీఎస్టీ కలిగే విస్తృత ప్రయోజనాలను ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జీఎస్టీ 2.0తో ప్రజలకు అవసరమయ్యే ప్రధాన వస్తువులన్నీ 5, 18శాతం పరిధిలోకి వచ్చినట్లు చెప్పారు. దీంతో ప్రజలకు ఆర్థికంగా మేలు కలుగుతుందన్నారు. క్యాన్సర్ మెడిసిన్స్, ఇన్సూరెన్సులపై జీఎస్టీ పూర్తిగా ఎత్తివేయడం శుభపరిణామంగా ఆయన చెప్పారు. తమ శాఖ ఆధ్వర్యంలో దుకాణాలను, షాపింగ్ మాల్స్‌ను తనిఖీ చేస్తూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జీఎస్టీ అమలు తీరును పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే పూర్తిస్థాయిలో జీఎస్టీ ఫలాలు అందుబాటులోకి వస్తాయని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.



# స్వదేశీ వస్తువులనే వాడుదాం.. స్థానిక వ్యాపారాన్ని అభివృద్ధి చేద్దాం

*(మొదటి పేజీ తరువాయి)*

కేతంరెడ్డి వినోద్ రెడ్డి అన్నారు. అలాగే ప్రజలకు బీమా కల్పించేదానిపై కూడా పన్నును తొలగించిందని వెల్లడించారు. పిల్లలకు ఉపయోగపడే పెన్సిళ్లు, బుక్కులు, ఇతర వస్తువులపై కూడా జీఎస్‌టీ లేకుండా చేసినట్లు పేర్కొన్నారు. దీంతోపాటు నిత్యం ఇళ్లలో ఉపయోగించే నిత్యావసరాల ధరలు కూడా తగ్గాయన్నారు. దీని ద్వారా ప్రతి ఇంట్లో ప్రజలకు లబ్ధి చేకూరుతోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఏడాదికి దాదాపు 2 లక్షల కోట్ల మేర ప్రజలపై భారం తగ్గుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో ప్రపంచ దేశాల్లో మన దేశం పరపతి పెరిగిందని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సుపరిపాలన అందుతోందన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేశారని, పి4 ద్వారా పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నారని చెప్పారు. జీఎస్‌టీ ద్వారా ప్రజలు సంతోషంగా ఉన్నారని, వ్యాపారులు కూడా జీఎస్‌టీ సంస్కరణలను స్వాగతిస్తున్నారన్నారు. నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, మంత్రిగా నారాయణను ప్రజలకు అత్యధిక మెజార్టీతో గెలిపించారని చెప్పారు. ఎంపీ సహకారంతో దగదర్తి ఎయిర్ పోర్ట్ నిర్మాణం కూడా త్వరగా పూర్తవుతుందని వివరించారు. కూటమి ప్రభుత్వం ప్రజల కోసమే పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ ఎండి జాకీర్ షరీఫ్, 43 డివిజన్ టిడిపి అధ్యక్షులు షేక్ జమీర్, టిడిపి మైనారిటి నాయకులు షేక్ ఫజల్ అహమద్, షేక్ హాజీ, సయ్యద్ ముజహర్, ఖాదర్‌బాషా, జవాద్, వినయ్, కుక్క ప్రభాకర్, గౌసున్నీస, జాన్సీ పాల్గొన్నారు.





## ఈవీఎం గోదాముల వద్ద పటిష్ట భద్రత

# చర్యలు చేపట్టాలి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ.. ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులకు సూచించారు. బుధవారం ఉదయం నగరంలోని ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో గల ఈవీఎం గోడౌన్లను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన మూడు గోడౌన్లను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. అగ్నిమాపక పరికరాలను పరిశీలించి అన్నీ కూడా కండిషన్లో ఉండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారులకు సూచించారు. గోడౌన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్డీవోకు సూచించారు. ఎన్నికల సంఘం సూచించిన నిబంధనల మేరకు ఈవీఎం గోడౌన్ల వద్ద అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి, బీజేపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీల ప్రతినిధులు రసూల్, శ్రీనివాస్, మందల వెంకటేష్ శేషయ్య, బాల సుధాకర్, జిల్లా రెవెన్యూ అధికారి కె.విజయ్ కుమార్, ఆర్డీవో అనూష, తహసిల్దార్ షఫీమాలిక్, ఎలక్షన్ డీటీలు ఆషర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్నానది పరిసరాలను శుభ్రపరిచిన

# ఎన్‌సీసీ క్యాడెట్లు

*(మొదటి పేజీ తరువాయి)*

వెంగళరావునగర్, కేఎన్‌ఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ భక్తవత్సలనగర్ ఎన్‌సీసీ క్యాడెట్లు నెల్లూరు రంగనాయకుల పేట సమీపాన ఉన్న పెన్నానది రోడ్డు బ్రిడ్జి, మహాభారతాన్ని ఆంధ్రీకరించిన కవి బ్రహ్మ తిక్కన పార్కు, పెన్నానది రైలు వంతెన తదితర నది పరివాహక ప్రాంతాలలో ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా గుండాల నరేంద్రబాబు మాట్లాడుతూ.. ఎన్‌సీసీ క్యాడెట్ల ఆధ్వర్యంలో ప్రతినిత్యం ప్రజలను చైతన్యపరిచేలా పలు సామాజిక అంశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు పలు ర్యాలీలు సదస్సులు నిర్వహించడం జరుగుతుందని, ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతహి సేవ కార్యక్రమాలలో స్వచ్ఛ నెల్లూరు నగరం.. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్.. స్వచ్ఛ భారత్.. కల సాకారం అయ్యేందుకు ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రతినిత్యం పలు సామాజిక సేవా కార్యక్రమాలలో పాలుపంచుకుంటుంటారని, ప్రపంచ శాంతికై పాటుపడే ఐక్యరాజ్యసమితి తీర్మానం మేరకు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 4వ శనివారాన్ని ప్రపంచ నదుల దినోత్సవంగా ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఘనంగా నిర్వహిస్తారని, దీని ప్రధాన లక్ష్యం నదులు, సముద్రాలు, చెరువులు, కొలనులు, సరస్సులు ప్లాస్టిక్ వ్యర్థాలతో కలుషిత కాసారాలు కాకుండా.. ప్రజలను అప్రమత్తం చేయడం, ప్లాస్టిక్ వస్తు ఉత్పత్తుల వాడకం వల్ల ఉత్పన్నమయ్యే పలు సమస్యలను పర్యావరణానికి వాటి వల్ల కలిగే తీవ్ర విఘాతాన్ని గురించి ప్రజలను నిత్యం జాగృతం చేయడం.. సముద్రాలు, నదులలోని జీవ రాశుల మనుగడకు ప్లాస్టిక్ కారకాలు ఎలాంటి హాని చేస్తున్నాయో తెలియజేయడం, సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ వస్తు వినియోగాన్ని తగ్గించేలా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు బాల్యం నుంచే సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, నదులు కొలనులు సరస్సులు, సముద్రాలు సంస్కృతి వికాసానికి పవిత్రతకు భక్తి భావనకు ఆధ్యాత్మిక చింతనకు, నాగరికతకు కేంద్ర బిందువులని వాటి పరిరక్షణ ప్రతి పౌరుని తక్షణ కర్తవ్యం అని, వాటి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలియజేయడమే ప్రపంచ నదుల దినోత్సవ ప్రధాన ఆశయమన్నారు. వాటి పవిత్రతపైనే మానవ మనుగడ సమస్త ప్రాణికోటి మనుగడ ఆధారపడి ఉందని, నదులు సముద్రాలు చెరువులు సరస్సులు, కొలనులు కలుషితం కాకుండా అటు ప్రభుత్వాలు ఇటు ప్రజలు సామాజిక సేవా సంస్థలు వాటి పరిశుభ్రతకు నిత్యం కృషి చేయాలని, పర్యావరణ పరిరక్షణకు నదులు, సముద్రాలు, చెరువులు కాలుష్యం బారినపడకుండా ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలకు కళాశాలలకు దసరా సెలవుల నేపథ్యంలో ప్రపంచ నదుల దినోత్సవం సందర్భంగా పెన్నానది పరివాహక ప్రాంతాలను పరిశుభ్రపరచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ పెట్టీ ఆఫీసర్ దీపక్‌కుమార్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య కార్మికులు మెడికల్ క్యాంపులు

# సద్వినియోగం చేసుకోవాలి : కమిషనర్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికుల కోసం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాలను కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణంతోపాటు 10అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ఏర్పాటు చేశారు. స్థానిక డైకస్ రోడ్డులోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ బుధవారం పర్యవేక్షించారు. శిబిరంలో కార్మికులకు అందిస్తున్న వైద్య సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణంతో పాటు నగర వ్యాప్తంగా ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. సఫాయిమిత్ర సురక్ష శివిర్ మెడికల్ క్యాంపులను నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య సేవలు పొందే కార్మికులందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు, ఆహారాన్ని అందిస్తున్నామని కమిషనర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు



నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, మలేరియా విభాగం అధికారి జీజియా బాయి, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం దిగుబడులు ఆశాజనం - ధరలు నిరాశామయం

● వర్షం భయం ● కుదేలవుతున్న రైతాంగం ● పట్టించుకోని ప్రభుత్వం ● ఏకరువుపెడుతున్న ప్రతిపక్షం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ప్రాంతంలో ఎడగారు వరిపైరు సాగు బాగుండడంతోపాటు దిగుబడులు అత్యంత ఆశాజనకంగా ఉండగా ధరలు అత్యంత నిరాశామయంగా ఉన్నాయని, ఈదెబ్బతో రైతాంగం కుదేలవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం రైతులకు యూరియా కొరత తీర్చలేకపోయిందని, పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడం లేదని ప్రతిపక్ష వైసిపి నేతలు ఏకరువుపెడుతున్నారు. అయినా ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించిన దాఖలాలు కానరావడం లేదు. ఆత్మకూరు మండలంలో పరిశీలిస్తుంటే ఈసీజన్‌లో వరి సాగుచేసిన రైతులు తమ దిగుబడుల పట్ల అత్యంత సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరో వారంరోజుల్లో వరికోతలు ఆరంభం కానున్నాయి. అక్కడక్కడా కొందరు మాత్రం వరి కోశారు. అయితే గత సీజన్‌లో ఎకరాకు రెండుపుట్లు వంతున సగటున దిగుబడి రాగా ఈదపా రెట్టింపుగా ఎకరాకు నాలుగుపుట్లు వంతున రాలనున్నాయని చెబుతున్నారు. ఎక్కడ చూసినా దిగుబడుల పట్ల అత్యంత సంతృప్తి వ్యక్తం చేస్తుండగా అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి చందంగా బియ్యం ధరలు ఆకాశంలో ఉన్నా పండించే వరిధాన్యానికి మాత్రం తగిన గట్టుబాటు ధరలు లభించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం వరి ధాన్యం ధర పుట్టి ఏగ్రేడ్ రకానికి 19700రూపాయలుగా, సాధారణ రకానికి 18750రూపాయలుగా నిర్ణయించింది. అయితే గత సీజన్ అనుభవాలతో ఈదపా కూడా ప్రభుత్వం కొనుగోలు చేసే పరిస్థితి లేదని భావిస్తున్నారు. ఇప్పటివరకు మార్కెట్లో పుట్టి ధాన్యం ధర 13వేల రూపాయలుగా ఉంది. ప్రభుత్వపరంగా ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. గిట్టుబాటు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్న ఆశలు ఆవిరవుతున్నాయని చెబుతున్నారు. ఈపరిస్థితి చూస్తుంటే దళారులద్వారా ప్రవేటు వ్యాపారులకు 13వేలకే అమ్ముకునే పరిస్థితి కన్పిస్తుందని , ఓవైపు నిత్యం ఆకాశం మేఘావృతమవుతూ వర్షం కురిసే పరిస్తితి కన్పిస్తోంది. కోతదశలో పైరు ఉండగా ఒక వర్షం కురిస్తే తీవ్రంగా రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు. ఆత్మకూరు మండలంలో పరిశీలిస్తే ఈ సీజన్‌లో 4200ఎకరాల్లో వరి సాగుచేశారు. వర్షం కురిస్తే 13వేలకు కూడా వ్యాపారులు కొంటారా అనే సందేహం వ్యక్తమవుతోంది. ధాన్యం తాము కొంటాం, మద్ధతుధర ఇస్తాం అని పలికే ప్రభుత్వం ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోగా ఒక వేళ ప్రారంభించినా మద్ధతుధరలకు కొనుగోలు చేస్తారా అనే సందేహం కూడా రైతన్నలను వెంటాడుతోంది. దిగుబడులు ఈదపా ఆశాజనకంగా ఉన్నా ధరల పరిస్థితి అత్యంత నిరాశాజనకంగా ఉందని, రెట్టింపుగా ధాన్యం దిగుబడి అయినా ధరలు చూస్తుంటే తీవ్రంగా నష్టపోయేలా ఉన్నామని పలువురు రైతులు ఆవేదనతో చెబుతున్నారు. మరి పాలకులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మద్ధతుధరకు కొనుగోలు చేసి వారు నష్టపోకుండా ఆదుకుంటారా లేదా వేచి చూడాల్సి ఉంది.

# ఆక్రమిస్తూ చేపట్టిన మెట్లు, ర్యాంపులు తొలగించండి : కమిషనర్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక గ్రాండ్ ట్రంకు రోడ్డు ప్రాంతంలో బుధవారం పర్యటించారు. డ్రైను కాలువలను ఆక్రమిస్తూ ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని స్థానిక ప్రజలకు కమిషనర్ సూచించారు. డ్రైను కాలువలను ఆక్రమిస్తూ చేపట్టిన మెట్లు, ర్యాంపులు వంటి ఇతర నిర్మాణాలు పూడికతీతకు అడ్డంకి ఉంటే తప్పనిసరిగా తొలగించి వేస్తామని కమిషనర్ హెచ్చరించారు. డ్రైను కాలువలలో క్రమం తప్పకుండా పూడికతీత పనులను చేపట్టి వాహనదారులకు, పాదాచా రులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా 24 గంటల్లోపు సిల్టును తొలగించాల్సిందిగా శానిటేషన్ విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ శానిటేషన్ విభాగం అధికారులు,



వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



## తల్లిపాలు ప్రాముఖ్యత గురించి అవగాహన

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు అర్బన్, రూరల్ పరిధిలోని 8వ రాష్ట్రీయ పోషణ మహోత్సవాల కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్వైజర్ వి.శకుంతల ఆధ్వర్యంలో బంగ్లా తోట అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యత, అనుబంధ ఆహారంపై తల్లులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

అనంతరం గర్భవతులకు సామూహిక సీమంతల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు జి.సునీత, జి.లలితా కుమారి, ఏ.సునీత, ఎన్.సునీత అంగన్వాడి హెల్పర్లు, గర్భవతులు, బాలింతలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన కాలనీలో ఉచిత షుగర్ పరీక్షలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి గిరిజన కాలనీలో బుధవారం స్థానిక అపోలోక్లినికల్‌ల్యాబ్ నిర్వాహకులు షేక్ సంధాని దాదాపు 50మందికి షుగర్‌వ్యాధి నిర్ధారణ రక్తపరిక్షలను ఉచితంగా చేశారు. ఆత్మకూరులో బీడీ కార్మికులు, జర్నలిస్టులు, అసంఘటిత రంగ కార్మికులకు తమ ల్యాబ్‌లో రాయితీతో రక్తపరిక్షలు నిర్వహిస్తున్న సంధాని పేదలైన కాలనీవాసులకు ఉచితంగా రక్తపరిక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదవర్గాలకు తనవంతుగా సేవలందించాలన్న లక్ష్యంగా తమ ల్యాబ్‌లో రాయితీతో రక్తపరిక్షలు నిర్వహిస్తున్నానని, తరచూ బీడీకార్మికులున్న ప్రాంతంలో, పేదలున్న ప్రాంతంలో తాను అక్కడికే వెళ్ళి వారికి ఉచితంగా రక్తపరిక్షలు నిర్వహిస్తున్నానని పేర్కొన్నారు. రాయితీతోనే రక్తగ్రూపు నిర్ధారణ పరిక్షలు కూడా చేస్తున్నానని సంధాని పేర్కొన్నారు. బీడీ కార్మికులు, ఇతర కార్మికులు తమ ల్యాబ్‌లో రాయితీతో రక్తపరిక్షల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంధాని కోరారు. తాను తమ అపోలో క్లినికల్‌ల్యాబ్‌లో నిరంతరం అందుబాటులో ఉంటానని ఆయన పేర్కొన్నారు.

## ఉత్సాహంగా వీఎస్‌యూలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉపకులపతి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే సేవా భావం, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. 'విద్యార్థులు సమాజానికి సేవ చేయడం ద్వారా దేశ భవిష్యత్తుకు పునాదులు వేస్తారు' అని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవా భావన పెంపొందించడంలో దోహదపడతాయని చెప్పారు. అనంతరం ఉపకులపతి, రిజిస్ట్రార్ కలిసి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి, శుభ్రతా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్. వెంకట్రాయిలు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయశంకర్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎస్.బి. సాయినాథ్, డాక్టర్ ఆర్.వి.ఎస్. శంకర్, డాక్టర్ పి.బి. సుచరిత, పిఆర్ఓ డాక్టర్ నీల మణికంఠతోపాటు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన బిజేవైఎం నాయకులు



**సంగం, మేజర్‌న్యూస్ :** ప్రపంచ నాయకుడు, ప్రియతమ భారత ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా.. దేశ వ్యాప్తంగా జరుగుతున్న 'సేవా పక్షోత్సవాల్లో' భాగంగా కిసాన్ నగరం మండలంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు అశోక్ నాయుడు, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు నరసింహనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి దాసరి శరవణ, ఎస్టీ మోర్చ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ మాజీ మండల అధ్యక్షులు నవాబుపేట శివాలయం కమిటీ మెంబర్ సిరిగిరి సత్యనారాయణ, మండల నాయకులు శ్రీనివాసులు, గుర్రం వెంకటేశ్వరరావు, కుమార్, బీజేవైఎం జిల్లా నాయకులు సాయి కృష్ణ, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా..

# శాసనమండలిలో అధికార పార్టీ మీద విరుచుకు పడ్డ ఎమ్మెల్సీ



## సమాధానం చెప్పలేక అడ్డగోలుగా మాట్లాడిన అధికార పక్షం

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌ల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ శాసన మండలిలో బుధవారం ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అధికార పార్టీపై విరుచుకు పడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్య కళాశాల అనేది ఒక వ్యవస్థ లాంటిదని అందుకు సంబంధించి 600కోట్ల రూపాయల బడ్జెట్, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు, సీనియర్ డాక్టర్లు, పూర్తిస్థాయిలో నర్సులు పారామెడికల్ సిబ్బంది, ఉచిత ఓపి సేవలు అందిస్తూ ఒక వ్యవస్థ లాగా పనిచేస్తుందన్నారు. ఒక ప్రభుత్వం వారి పాలనా సమయంలో ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడమనేది. ఎన్నో సవాళ్లతో కూడుకున్న విషయమన్నారు. అలాంటిది గత ప్రభుత్వంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ఏకంగా 17 నూతన ప్రభుత్వ మెడికల్ కళాశాలను తీసుకువస్తే కూటమి ప్రభుత్వం వాటన్నిటిని అమ్మేస్తూ వ్యంగ్యంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి ఆంధ్రప్రదేశ్లో కేవలం 11 మెడికల్ కళాశాలలు ఉంటే ఇందులో తెలుగుదేశం పార్టీ ఒక్క మెడికల్ కళాశాలను కూడా ప్రారంభించకపోగా జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చిన 17 నూతన మెడికల్ కళాశాలలను తెలుగుదేశం పార్టీ వెటకారంగా మాట్లాడడం బాధాకరమన్నారు. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ సహకారంతో వచ్చినవే అంటున్నారు. 2016లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నారనీ. ఆ సమయంలో జిల్లాకు ఒక మెడికల్ కళాశాల ఏర్పాటు చేసుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం చెప్పిందన్నారు. ఆ సమయంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 157 కొత్త మెడికల్ కళాశాలను మంజూరు చేస్తే తెలుగుదేశం పార్టీ బిజెపితో పొత్తులో ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్‌కు ఒక్కటంటే ఒక్క మెడికల్ కళాశాల కూడా మంజూరు చేయించుకోకపోవడం వారి అసమర్ధ పాలనకు నిదర్శనమన్నారు. అనంతరం జగన్మోహన్‌రెడ్డి తన పాలనలో 17 నూతన మెడికల్ కళాశాలలను తీసుకువస్తే వారిని అభినందించాల్సింది పోయి దానిని తప్పుపడుతున్నారంటే.. ఇంతకంటే నీచం ఇంకొకటి ఉండదన్నారు. కోవిడ్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బంది పడుతున్నప్పటికీ. అంచలంచెలుగా 17 నూతన మెడికల్ కళాశాలలకు ప్రభుత్వం అనుమతులు తీసుకువచ్చిందన్నారు. 17 నూతన మెడికల్ కళాశాలలకు సంబంధించి 2022, 2023, 2024లో అనుమతులకు సంబంధించిన జీవోలు తీసుకువస్తే 2023 సంవత్సరంలోనే ఐదు మెడికల్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. ఒక ప్రణాళిక బద్ధంగా మెడికల్ కళాశాలలను పూర్తి చేయాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం పని చేసింది అన్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చెబుతున్న మాట.. ఇంకా ఈ మెడికల్ కళాశాలలో పూర్తి చేయాలంటే 6000 కోట్లు కావాలి. దానికి 22 సంవత్సరాల సమయం పడుతుందని అందువలన దీనిని పీపీపీ మోడ్‌లో ప్రైవేటుకు అప్పగిస్తున్నామని ప్రభుత్వం తెలిపిందన్నారు. 45,975 స్కూళ్లను నాడు నేడు ద్వారా త్రీ ఫేజెస్‌లో పూర్తి చేస్తామని పూర్తి చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డి దని గుర్తు చేశారు. అలాగే 10778 ఆర్బికేలు,15 వేల సచివాలయాలు, 10332 విహెచ్‌సిలు ఇలా అనేక మౌలిక వసతులు ఈ రాష్ట్రంలో చెప్పింది చెప్పినట్టుగా 5ఏళ్లలో రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు జగన్మోహన్ రెడ్డి తీసుకువచ్చారని తెలిపారు. మన రాష్ట్ర బడ్జెట్‌లో 2శాతం బడ్జెట్ సొమ్మును మెడికల్ కళాశాలలు పూర్తి చేయడానికి వెచ్చిస్తే అవి అందుబాటులోకి వస్తాయన్నారు. మరో పక్క 95శాతం పనులు పూర్తి చేసిన పులివెందుల మెడికల్ కళాశాల గురించి ఇష్టారాజ్యాంగా మాట్లాడటం సరికాదన్నారు. 95శాతం పూర్తయిన మెడికల్ కళాశాలను ప్రభుత్వం మిగిలిన 5శాతం పనులు పూర్తి చేసి ప్రభుత్వ మెడికల్ కళాశాలగా కొనసాగించవచ్చు కదా దాన్ని ఎందుకు ప్రైవేటుకు అప్పగిస్తున్నారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ని సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను బలోపేతం చేసుకోవాల్సింది పోయి వాటిని ఈరోజు ప్రైవేట్‌కి అప్పగిస్తూ ప్రభుత్వ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు అందుబాటులోకి వస్తే.. ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుతాయని, తద్వారా ప్రజారోగ్య మెరుగుపడుతుందన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన పిపిపి మోడ్ అంటే ప్రైవేట్ వ్యక్తులు లాభపేక్షతోనే మెడికల్ కళాశాలలు నిర్వహించే పరిస్థితి వస్తుందన్నారు. మెడికల్ కళాశాలల్లో సీట్లు విషయానికొస్తే గత ప్రభుత్వంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు బి కేటగిరీ అయితే 12 లక్షలు, సి కేటగిరి అయితే 20లక్షలు పెట్టారని ఈరోజు కూటమి ప్రభుత్వం పీపీపీ మోడ్‌లో బి కేటగిరి 13.20 లక్షల ఇరవై వేలు, అదే సి క్యాటగిరి 39.60 లక్షలు అంటే దాదాపుగా 40లక్షల రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి ఉంటుందని ఇలా ప్రైవేట్ వ్యవస్థలో ప్రతి దాంట్లో అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ఏ విధంగానూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేట్ మెడికల్ కళాశాలల వ్యవస్థ అనేది సమంజసం కాదన్నారు. జగన్మోహన్ రెడ్డి తీసుకువచ్చిన విధానాలతో సంవత్సరానికి ఒక్కొ మెడికల్ కళాశాలకు 46 కోట్లు రెవిన్యూ వస్తుందని దీంతో మెడికల్ కళాశాలలను అభివృద్ధి చేసుకోవచ్చని ఎందుకు ఈ పీపీపీ మోడ్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందో తెలియజేయాలన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో వైద్య కళాశాలలకు పీపీపీ మోడ్ సరైన విధానం కాదని కూటమి ప్రభుత్వం దాన్ని ఉపసంహరించుకొని ప్రభుత్వమే మెడికల్ కళాశాలలను నిర్వహించాలని స్పీకర్ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

# ఎంపీడీఓగా ఎంవీ రామ్మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండల నూతన ఎంపీడీఓగా ఎంవీ రామ్మోహన్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సైదాపురం మండలంలో ఎంపీడీఓగా పనిచేస్తున్న రవీంద్రబాబు పదోన్నతపై తిరుపతి జిల్లా దక్కిలికి మండలానికి బదిలీ అయ్యారు. అనంతరం సైదాపురం మండలం నూతన ఎంపీడీఓ రాకను పరిపాలన అధికారి, మురళీకృష్ణ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు స్వాగతిస్తూ ఆయనను శాలువా వేసి పూల బోకేతో ఘనంగా సన్మానించారు. కనిగిరిలో డిప్యూటీ ఎంపీడీవో గా విధులు నిర్వహిస్తున్న ఎంవీ రామ్మోహన్ రెడ్డి పదోన్నతి బదిలీలలో భాగంగా సైదాపురం మండలానికి ఎంపీడీఓగా ప్రమోషన్ మీద వచ్చినట్లు ఆయన తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మీకందరికీ కూడా నేను సుపరిచితుడేనని అన్నారు. విధులలో పారదర్శకంగా పనిచేయాలన్నారు. ముఖ్యంగా గ్రామాలలో పారిశుద్ధ్య పనులపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచి మండల ప్రజలు అంటువ్యాధులు భారీన పడకుండా దోమల నివారణకై బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ చేయిస్తూ చర్యలు చేపట్టాలన్నారు.



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మనమందరం విధులలో అలసత్వం వహించకుండా సమయానికి కార్యాలయాలకు వెళ్లేలా చూసుకోవాలన్నారు పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవోకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఏపీవో సురేంద్రబాబు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై దృష్టి సారించిన పంచాయితీ అధికారులు




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** పంచాయతీలో పారిశుధ్యంకై పంచాయతీ అధికారులు దృష్టి సారించారు. ఎంపీడీవో కే.శ్రీనివాస్ రెడ్డి, ఈవోపీఆర్డి కే.రామారావు ప్రత్యేకంగా పరిసరాలను పరిశీలించి చెత్తను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో మురుగు కాలువ పూడిక తీయించారు. సమీపంలో ఉన్న చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు తగిన జాగ్రత్తలు వహిస్తూ అందుకు తగిన విధంగా చర్యలు చేపట్టినట్లు వారు తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న విధంగా ప్రజలు ఆరోగ్య దాయకంగా ఉండాలన్నారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా కార్యక్రమాన్ని చేపట్టి పరిసరాలను పరిశుభ్రం చేయిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దూరు రాజగోపాల్ రెడ్డి పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## నియోజకవర్గం నుండి జిల్లా కేంద్రానికి రోడ్డు ఏర్పాటు చేయండి

▸ అసెంబ్లీలో గళం విప్పిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజకవర్గం మండల కేంద్రం నుండి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రానికి డబల్ లైన్ రోడ్డు ఏర్పాటు చేయాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శాసనసభలో తమ గళం వినిపించారు. మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి ప్రశ్నను సంధించారు. ఉదయగిరి నియోజకవర్గం ఏర్పడిన నాటినుండి నేటి వరకు జిల్లా కేంద్రానికి డబల్ లైన్ రోడ్డు లేదని ఉదయగిరి నుండి నందవరం వరకు 29 కిలోమీటర్లు పొడవైన రోడ్డును డబల్ లైన్ రోడ్డుగా ఏర్పాటు చేస్తే, రెండు హైవే లను కలపడమే కాకుండా, జిల్లా కేంద్రం నుండి నియోజకవర్గానికి డబల్ లైన్ రహదారి ఏర్పడుతుందని, అంతేకాకుండా ఆత్మకూరు నియోజకవర్గంలో కూడా కొంత భాగం ఈ రోడ్డు ఉందని, ప్రస్తుతం ఈ రోడ్డు పరిస్థితి కూడా అధ్వానంగా ఉందని సభాపతి ద్వారా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కోరారు.

## మెడికల్ క్యాంపును నిర్వహించిన డాక్టర్లు



**సంగం, మేజర్‌న్యూస్ :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థి నారి స్వస్థ పరివార అభియాన్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్లు శ్రీనివాసులు రెడ్డి, అశోక్ కుమార్ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. మెడికల్ క్యాంపులో ప్రజలు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను డాక్టర్లు పంపిణీ చేశారు.

## ఆధార్ సేవలను వినియోగించుకోండి

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆధార్ అప్డేట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో కే.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఐదు సంవత్సరాలు



పైబడిన వారికి ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ చేయించుకునే అవకాశం ఉందన్నారు. అలాగే ఆధార సంబంధించిన ఇతర అంశాలను కూడా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కావున మండలంలోని ప్రజలందరూ తమ ఆధార్ కార్డు అప్డేట్ అవకాశాలను సద్వినియోగపరుచుకోవాలని అని కోరారు. ఈ కార్యక్రమం 26వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు.

# అత్యంత వైభవంగా కొనసాగుతున్న శరన్నవరాత్రులు







**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** శరన్నవరాత్రుల వేడుకలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా ప్రధాన దేవాలయాలు నెల్లూరులోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయం, శ్రీ రాజరాజేశ్వరి ఆలయం వంటి ప్రముఖ దేవాలయాలలో శరన్నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు.

### శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో

నెల్లూరు దుర్గామిట్టలో వేంచేసియున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానము నందు శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా బుధవారం శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి శ్రీ గాయత్రి అలంకారం చేయుట జరిగింది. శ్రీ గాయత్రి అలంకారంకు ఉభయకర్తలుగా శ్రీ గడ్డం రత్నయ్య – శ్రీమతి సుజాతమ్మ వ్యవహరించారు. తదుపరి సంపుటీకరణ చండీ హోమము జరిగినది. సంపుటీకరణ చండీ హోమం ఉభయకర్తలుగా కె.లక్ష్మీ వెంకట సంజీవ రావు శ్రీమతి హిమబిందు, శ్రీ సుందరేశ్వర స్వామి ఆలయం నందు శ్రీ లలితా కుంకుమార్చన/ మహాన్యాసంకు ఉభయకర్తలుగా సోమవరపు సూర్యనారాయణ రావు, విజయలక్ష్మి, వ్యవహారించారు. సాయంత్రం ప్రత్యేక పుష్పాలం కారంకు ఉభయకర్తలుగా కొండ్రెడ్డి భరత్‌కుమార్, ఇందిరాప్రియదర్శని వ్యవహరించారు.ఆలయ సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్ రెడ్డి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఏలూరు శిరీష తదితర సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో

శ్రీ దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలలో భాగంగా మూడవ రోజు స్థానిక శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మూడవ రోజు శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు శ్రీ గజలక్ష్మి అమ్మవారి అలంకారంలో భక్తులకు దర్శమిచ్చారు. శ్రీ దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని ఉదయం అమ్మవారికి అభిషేకం, చండీయాగం సాయంత్రం శ్రీ లలితా సహస్రనామ కుంకుమార్చన పూజలు విశేషరీతిలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాలను కనులారా అమ్మవారి కరుణాకటాక్షముల కోసం మరియు వీక్షించుట కోసం విచ్చేసిన భక్తులకు అర్చక స్వాములు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీ గజలక్ష్మి అమ్మవారి అలంకారంకు ఉభయకర్తలు విజయలక్ష్మి, చండీయాగం ఉభయకర్తలు శ్రీ గొల్లపూడి సాయిపవన్, శ్రీ లలితా సహస్రనామ కుంకుమార్చన శ్రీ లలితా సహస్రనామ పారాయణ బృందం వారు, అభిషేకం, పూలంగిసేవ, పల్లకిసేవ ఉభయకర్తలు శ్రీ కందికట్టు మధుసూదన్, గిరిజ వ్యవహరించారు. ఉదయం, సాయంత్రం ప్రసాద వినియోగం, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవోపేతంగా జరిగినాయి. పై కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, నూతన ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ ఒట్టూరు సురేంద్రయాదవ్ మిగతా సభ్యులు, పులికొలను చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో

నెల్లూరు స్టోన్ హౌస్ పేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రులలో భాగంగా అమ్మవారు శ్రీ బాలత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయంలో వివిధ సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినారు.

### శ్రీ భువనేశ్వరి దేవి ఆలయంలో

శ్రీ దేవి శరన్నవరాత్రుల సందర్భంగా బుధవారం రాత్రి 7 గంటలకు శ్రీ భువనేశ్వరి అమ్మవారు శ్రీ భువనేశ్వరి అమ్మవారి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వడమైనది. ఈ కార్యక్రమంకు ఉభయకర్తలుగా శ్రీ పి.జగదీష్ రెడ్డి మైధిలి వ్యవహరించారు.

# రేషన్‌కార్డులు, ఫింఛన్ల కోసం జనాల నిరీక్షణ

- ప్రభుత్వం నుండి విడుదల కాని ఉత్తర్వులు
- నిబంధనలు సడలించాలంటున్న జనాలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నూతనంగా రేషన్‌కార్డులు, వివిద రకాల పెన్షన్లకు అర్హులైన వారు ప్రభుత్వ ఆదేశాలు, ఉత్తర్వులకోసం ఎదురు చూస్తున్నారు. 3నెలల క్రితం జిల్లాలో పర్యటించిన రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ త్వరలో రేషన్‌కార్డులంటూ చేసిన ప్రకటనతో జనాల్లో ఆశలు రేగాయి. కానీ ఇప్పటివరకు నోటిఫికేషన్ విడుదలకు నోచుకోలేదు. కాగా వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని, నిబంధనలు సడలించాలని సర్వత్రా కోరుతున్నారు. రేషన్‌కార్డులు, పెన్షన్లకోసం దరఖాస్తులు చేసుకోవాలంటూ సోషల్‌మీడియాలో అప్పుడప్పుడూ కన్పిస్తుందేకానీ ఇంకా ప్రభుత్వం తగిన ఉత్తర్వులివ్వలేదు. అర్హతల నియమావళిని కూడా విడుదల చేయలేదు. అయితే వివిద పెన్షన్లు, రేషన్‌కార్డులు, సంక్షేమకార్యక్రమాల మంజూరులో అర్హులందరికీ న్యాయం చేయాలని, గతప్రభుత్వంలోఉన్న నిబంధనలను సడలించాలని వివిద వర్గాల ప్రజలు కోరుతున్నారు.గత ప్రభుత్వ నిర్ణయాలు అమలు చేస్తే ఇబ్బందికరమని కొందరు, కొన్ని నిర్ణయాలు అమలుచేయకుంటే ఇబ్బందికరమని మరికొందరు అభిప్రాయపడ్డారు. 20సంవత్సరాలకు క్రితం ప్రభుత్వం డిఫారం పట్టాగా రైతులకు ఇచ్చిఉంటే అలాంటివారికి ఫ్రీహోల్డ్ అంటూ వైసిపి ప్రభుత్వం పలువురు రైతులకు ఫ్రీహోల్డ్ అంటూ సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. ఈ సర్టిఫికేట్ ద్వారా ఆ భూములను విక్రయించుకోవచ్చని, రిజిస్టర్ చేసుకోవచ్చని నిర్ణయించారు. దాదాపు ఏడాదిన్నరక్రితం ఈ సర్టిఫికేట్లు ఇవ్వడంతోపాటు ఆన్‌లైన్‌లో ఆయా పొలాలకు సంబంధించి గత ఏడాది ఫ్రీహోల్డ్ చేయబడిందని నమోదు చేశారు. కానీ తీరా చూస్తే ఈ నూతన ప్రభుత్వం ఫ్రోహోల్డ్ అంశాన్ని పెండింగ్‌లో ఉంచింది. దాంతో ఆ సర్టిఫికేట్లు పొందిన రైతులు తీవ్ర నిరాశకుగురై ఆవేదన చెందుతున్నారు. తమకు 20సంవత్సరాలకు ముందు ఇచ్చిన డిఫారం పట్టాలు శాశ్వతపట్టాలుగా మారనున్నాయని సంబరపడ్డ రైతులు దిగాలు చెంది ఉన్నారు. ప్రభుత్వం ఈవిషయమై పరిశీలించిన కొత్తగా ఇవ్వకున్నా ఇప్పటివరకు ఇచ్చిన ఫ్రీహోల్డ్ అంటూ సర్టిఫికేట్లు ఇచ్చివారికి చెల్లుబాటు అయ్యేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకొని న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

### ఫించన్లకు గత ప్రభుత్వ నియమాలు పాటించవద్దు

వివిద రకాల పెన్షన్ల కొనసాగింపు, మంజూరుకు గత వైసిపి ప్రభుత్వ నియమాలు అమలుచేయవద్దని, చాలామంది తీవ్రంగా నష్టపోతారని అనేకమంది పెన్షనర్లు, పెన్షన్‌కు అర్హులైనవారు కోరుతున్నారు. గత ప్రభుత్వం దారిద్ర్యరేఖకు దిగువనున్న రైస్‌కార్డుదారులందరూ అర్హులు కాగా విద్యుత్ వినియోగం నెలకు 300యూనిట్లుకన్నా అధికంగా ఉందని, ఇంటికొలతలు అధికంగా ఉన్నాయని, నాలుగుచక్రాల వాహనాలున్నాయని, కుటుంబసభ్యులు ఆదాయపన్నులు చెల్లిస్తున్నారంటూ అనేకమందిని అనర్హులుగా చేసి పెన్షన్‌లు రద్దుచేశారు. అర్హులు నూతనంగా దరఖాస్తులు చేసుకునే అవకాశం లేకుండా చేశారు. దాంతో అందరూ లబోదిబో అంటూ తీవ్ర ఆవేదనకు గురికాగా పెన్షన్లను రద్దుచేసి పలువురికి వైసిపి ప్రభుత్వం అన్యాయం చేస్తుందంటూ తెలుగుదేశం నాయకులు గగ్గోలు పెట్టారు. కాగా రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వం అదే నియమాలను అమలుచేయనుందని, అనర్హులంటూ పలువరి పెన్షన్లకు ముప్పురానుందని, కొత్తగా పెన్షన్ల మంజూరుకు గత నిర్ణయాలు, నియమాలు పాటించనున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. గత నిర్ణయాలు అమలు ఉంటుందా లేదా, తాజా నిర్ణయాలా అనేది ప్రభుత్వం నుండి సచివాలయాకు ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదంటున్నారు. ఏదేమైనా అర్హులకు నియమావళి అంటూ రైస్‌కార్డుదారులకు నూతన పెన్షన్లు మంజూరుకాకున్నా, ప్రస్తుతం ఉన్న పెన్షన్లు రద్దయినా అనేకమంది నష్టపోయేపరిస్థితి, ఆందోళనకుగురయ్యే పరిస్థితి, అలజడి చెలరేగే పరిస్థితి ఉంటుందని, ప్రభుత్వం పునరాలాలోచించి గతంలో తెలుగుదేశం అమలుచేసిన నియమావళినే ప్రాతిపదికన తీసుకోవాలని, వైసిపి నియమాలు అమలుచేయరాదని, సాధారణ,మద్య తరగతి కుటుంబాలవారు కూడా విద్యుత్ 300యూనిట్లకన్నా అధికారంగా వినియోగించుకునే పరిస్థితి ఉంటుందని, బిడ్డలు చదువుకుంటూ కనీస అవసరాలను వాడుకూటుంటారని, అలాంటివారిని గమనించాలని, ఆంక్షలపేరుతో పెన్షన్లు రద్దుచేయారాదని అనేకమంది కోరుతున్నారు.

# సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు

- సింగారెడ్డిపల్లి గ్రామంలో స్వస్థ నారి-సశక్తపరివార్ అభియాన్
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిజెపి నాయకులు మూడమల రమేష్ రెడ్డి



**సీతారామపురం, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని సింగారెడ్డిపల్లి గ్రామంలో వైద్యాధికారిని డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో వైద్య మరియు ఆరోగ్య సిబ్బందితో కలిసి, మహిళల సంపూర్ణ ఆరోగ్యం కొరకు 'స్వస్థ నారి–సశక్తపరివార్ అభియాన్' (ఆరోగ్యవంతమైనమహిళ– శక్తి వంతమైన కుటుంబం) ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజవర్గ బిజెపి నాయకులు, మండల ప్రోగ్రాం కన్వీనర్, మూడమాల రమేష్ రెడ్డి ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న వైద్య శిబిరాల వలన మహిళల్లో వివిధ రకాలైన వ్యాధుల గురించి అవగాహన కల్పించి, వైద్య చికిత్సలు చేయటం జరుగుతుందని తెలిపారు. మహిళలు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి, వైద్యులు తెలియజేస్తారని తెలిపారు.పౌష్టికాహారం తీసుకున్నందువల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ,వ్యాధి నిరోధక శక్తి పెరిగితే రోగాల బారిన పడరని దీనిని ప్రతి ఒక్క మహిళ గుర్తించుకోవాలని తెలిపారు. ఎక్కడ మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటారో ఆ కుటుంబం, ఆ ప్రాంతం, ఆ రాష్ట్రం, ఆ దేశం, బలంగా ఉంటుందని ప్రధాని నరేంద్ర మోడీ ఉద్దేశం అని, దీనిలో భాగంగానే ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలోఎం ఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్ వాడీ కార్యకర్తలు ఎఫ్‌డిపి సిబ్బంది పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎన్బిటి కాలనీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం, పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వైఓ నందన్ వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ.. స్వచ్ఛత హీ సేవ-2025లో భాగంగా స్వచ్ఛభారత్ మిషన్ సహకారంతో ఎన్బిటి కాలనీలోని పారిశుద్ధ కార్మికులందరికీ వైద్యం, ఆరోగ్య పరీక్షలతో పాటు క్యాన్సర్ పై అవగాహన, బీపీ, షుగర్ పరీక్షలు, నేత్ర సంబంధ వ్యాధులు, పారిశుద్ధ్య లోపం, నీటి కలుషితం వలన కలుగు వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, పారిశుద్ధ్య కార్మికులందరూ ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకుంటూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని అన్నారు. మీరు ఆరోగ్యంగా ఉంటేనే పరిసరాలు పరిశుభ్రంగా ఉండగలవని, ప్రతి యుపీహెచ్‌సి నందు కార్పొరేట్ హాస్పిటల్స్‌కి తక్కువ కాకుండా వ్యాధి నిర్ధారణ ఆధునిక వైద్య పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కనకాద్రి మాట్లాడుతూ.. సఫాయిమిత్ర సురక్ష వైద్య శిబిరంను సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ రెండో తేదీ వరకు ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్మికుల కుటుంబ ఆరోగ్య సంక్షేమం కొరకు వివిధ రకాలైన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలియజేశారు. అనంతరం పిఎంపి, రూడ్స్



సంస్థలు నగర కమిషనర్ వైఓ నందన్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కనకాద్రి లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డా.జిజియాబాయి, యు.పి.హెచ్.సి వైద్యాధికారి డా. రీనాభారతి, వెటర్నరీ వైద్యాధికారి డా. మదన్ మోహన్, 32వ డివిజన్ కార్పొరేటర్ తాళ్లూరి అవినాష్, కమ్యూనిటీ ఆర్గనైజర్ కొండాపురం వెంకటేశ్వర్లు, పి.ఎం.పి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కే.సుబ్బారావు, సూపర్వైజర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో ఆర్టీసీలో సమస్యలకు పరిష్కారం గగనమేనా

**● కొత్తసర్వీసులు లేనట్లేనా ● రాని బస్సులుతో ప్రయాణీకుల అవస్థలు సాగాల్సిందేనా**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని ఆర్టీసీ డిపో క్రమీణా తిరోగమనం వైపు సాగుతుందన్న అభిప్రాయం సర్వత్రా నెలకొంది. ఈ డిపోకు కొత్తగా బస్సులు రావడంలేదు. కొత్తసర్వీసులు కావాలన్న జనాల చిరకాల కోర్కెలు నెరవేరడం లేదు. వివిద డిపోలకు చెందిన బస్సులు ఆత్మకూరు పట్టణంలోకి రావడం లేదు. దాంతో ప్రయాణీకులు తీవ్రంగా ఇబ్బందిపడుతుండగా నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపైన ఉన్న ఆత్మకూరు మండలం కరటంపాడుకుగానీ, మండలకేంద్రమైన మర్రిపాడుకు గానీ, ఆ మండంలోని డి.సి.పల్లికిగానీ, సమీప నియోజకవర్గమైన ఉదయగిరికి గానీ వెళ్ళాలంటే ఆత్మకూరు నుండి బస్సులు లేని పరిస్థితి కొనసాగుతుంది. కర్నూలుమీదుగా హైదరాబాదుకు బస్సు నడపాలని, చెన్నైకు హైటెక్ బస్సు నడపాలని, రాజధాని అమరావతికి బస్సునడపాలని పలువురు పదేపదే కోరినా ఆ కోర్కెలు నేటికీ నెరవేరలేదు. ఈసమస్యలపై ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్మికసంఘాలవారు ఆర్టీసీ అధికారుల దృష్టికి అనేకదపాలు తీసుకెళ్ళి సమస్యల పరిష్కారం కానందున వారు అలసిపోయి మౌనందాల్చారు. మార్చిలో ఆత్మకూరు డిపోకు విచ్చేసిన ఆర్టీసీ రీజనల్ చైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి ఈ సమస్యలన్నింటిని కార్మికులు, పలువురు నాయకులు, ప్రయాణీకులు వివరించడంతోపాటు వినతిపత్రాలు కూడా సమర్పించారు. పరిశీలిస్తానని ఆయన హామీ ఇచ్చారు. బస్సులు అనేకం ఆత్మకూరు పట్టణానికి రానందున ప్రయాణీకులు 10రూపాయలు, 20రూపాయలు వెచ్చించి ఆటోల్లో నెల్లూరుపాళెంకు చేరుకొని అక్కడనుండి బస్సుల్లో ప్రయాణిస్తుండగా పలువురు ఆటోలనే ఆశ్రయిస్తున్నారు. ఆటోల ప్రయాణం ప్రమాదకరమని ఆర్టీసీవారు చెబుతుంటారు కానీ అందుకుతగిన బస్సులు నడపడంలేదని ప్రయాణీకులు అంటుంటే ఆటోలవలన జనాలు తమ బస్సుల్లో సక్రమంగా ఎక్కనందున నష్టం వస్తుందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. హైదరాబాదుకు గతంలో ఆరు బస్సులు ఆత్మకూరు డిపోనుండి నడుపుతుండేవారు. ప్రస్థుతం ఒక్క బస్సుమాత్రమే నడుపుతున్నారు. అదేమంటే రాబడి లేదని చెబుతున్నారు. ప్రవేటు బస్సులకు ధీటుగా నడపడం, కర్నూలుమీదుగా నడపడం జరిగితే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తారు కదా అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇతర జిల్లాలకు చెందిన కడప, అనంతపురం, జమ్మలమడుగు, బనగానపల్లి, తాడిపత్రి, పుట్టపర్తి, కళ్యాణదుర్గం, మన జిల్లాకు చెందిన నెల్లూరు, ఉదయగిరి, వాకాడు తదితర డిపోల బస్సులు ఆత్మకూరు పట్టణంలోకి రాకుండా బైపాస్ అంటూ నెల్లూరుపాళెం మీదుగా నడుస్తున్నాయి. రాత్రివేళ ప్రయాణీకులు నెల్లూరుపాళెం వద్ద బస్సు దిగి అక్కడ ఆటోలు లేక, జనసంచారంలేక ఆందోళనకు గురికావడం, అవస్థలుపడడం, వారికోసం వారి బంధువులు నెల్లూరుపాళెంకు వెళ్ళి అక్కడనుండి తమవారిని తీసుకురావాల్సిన పరిస్థితి కొనసాగుతుంది. మన జిల్లా బస్సులు కూడా పట్టణంలోకి రానందున ఉదయగిరి, మర్రిపాడు, కరటంపాడు, డి.సి.పల్లి తదితర ప్రాంతాలకు వెళ్ళాలంటే ఆటోల్లో నెల్లూరుపాళెంకు వెళ్ళి అక్కడ బస్సులెక్కడం వలన సమయం వృధా, అదనపు వ్యయం అవుతుంది. నెల్లూరుపాళెంనుండి 3కిలోమీటర్లలోని ఆత్మకూరు పట్టణానికి బస్సులురావాలంటూ అంతగా వారు ఇబ్బందిపడుతుంటే ప్రయాణీకులు ఎన్ని ఇబ్బందులు పడినా పరావలేదని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారా అని సర్వత్రా ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యలపై గతంలో మంత్రి హోదాలో నేటి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆర్టీసీ ఉన్నతాధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని కోరినా ఫలితం లేకపోయింది. ఆత్మకూరు పట్టణం జాతీయరహదారికి 3 కిలోమీటర్లలో ఉండడమే శాపమా, తాము చేసుకున్న పాపమా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలోకి వచ్చేందుకు 10 నిముషాలు సమయం పడుతుందని ఆర్టీసీవారు భావిస్తే ప్రయాణీకులు ఎంతసమయం వృధా చేసుకున్నా, అదనపు భారం మోస్తున్నా పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్నారు. అమరావతి రాజధాని కేంద్రంగా ఉండగా అక్కడకు ఒక్క బస్సునడేపే అవసరం లేదా అని కూడా ప్రశ్నిస్తున్నారు. ఇందనపొదుపు అంటూ ఆత్మకూరు డిపోబస్సుల వేగం పరిమితం చేశారని, అందుకే ఆత్మకూరునుండి నెల్లూరుకు పలు ఆర్టీసీ బస్సులున్నా అనేకమంది నెల్లూరుపాళెంకు వెళ్ళి ఉదయగిరి, ఇతర జిల్లాల బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. ఈసమస్యలను గురించి రెండేళ్ళ క్రితం ఆత్మకూరుకు విచ్చేసిన రవాణాశాఖామంత్రి పినిపేవిశ్వరూప్‌కు అప్పటి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ద్వారా ప్రజలు వినతిపత్రాలు అందజేయగా అతిత్వరలో సమస్యలు పరిష్కరిస్తామని హామీలిచ్చి వెళ్ళారు. ఇక అంతేసంగతులు ఆ హామీల మాటే మరిచిపోయారు. ఇక్కడి సమస్యలు అలాగే నిలిచిపోయాయి. ప్రభుత్వరంగ సంస్థ, ప్రభుత్వంలో విలీనమైన సంస్థ కేవలం రాబడిలేదని బస్సులు హైదారాబాదులాంటి నగరాలకు కూడా తగ్గించడం, కొత్త సర్వీసులు ప్రారంభించకపోవడం, పలుమార్గాల్లో సక్రమంగా బస్సులు నడపకపోవడం సబబేనా అని పలువురు ప్రవ్నిస్తున్నారు. పరోక్షంగా ప్రవేటు బస్సులకు, ఆటోలకు ప్రభుత్వం ఊతమిస్తుందా అనే సందేహాలు కూడా వ్యవక్తమవుతున్నాయి. మరి ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రభుత్వ పాలకులు ఆత్మకూరులోని ఆర్టీసీ సమస్యలను పరిశీలించి తగిన చర్యలద్వారా సమస్యలు పరిష్కరిపస్తారా, కనీసం అన్ని బస్సులు ఆత్మకూరు పట్టణంలోకి వచ్చేలా చేస్తారా, లేక ఆత్మకూరు పట్టణాన్ని జాతీయరహదారిపైకే తరలించమంటారా వేచి చూడాల్సి ఉంది.

### తహసీల్దార్ కార్యాలయంలో

## బిఎల్ఓల సమావేశం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం తహసిల్దార్ రామ్మోహన్ బిఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిఎల్వోలు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఓటర్ల జాబితాను జాగ్రత్తగా పరిశీలించుకోవాలన్నారు. 2002 ఓటర్ల జాబితా, 2025 ఓటర్ల జాబితాను సరిచూసుకొని 30సంవత్సరాల వారిని గుర్తించి జాబితా తయారు చేసుకోవాలన్నారు. తప్పులు లేని స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలన్నారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎలక్షన్ సీనియర్ సహాయకులు నీహా, సిఏ అలీం తదితరులు పాల్గొన్నారు.

# స్వస్థ నారీ స్వశక్తి పరివార్ ఆరోగ్య శిబిరం




**జలదంకి, మేజర్‌న్యూస్ :** చిన్నక్రాకలో బుధవారం స్వస్థనారి ససక్తి పరివార్ అభయాన్ ఉచిత వైద్య శిబిరం సర్పంచ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి బిజెపి మండల అధ్యక్షులు ముడి కిషోర్ రెడ్డి, టిడిపి నాయకులు చేవూరు జనార్ధన్ రెడ్డి, టిడిపి మాజీ మండల పార్టీ అధ్యక్షులు చిత్తా బత్తిన మస్తాన్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి పుట్టినరోజు సందర్భంగా సక్షోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నమన్నారు. మహిళల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని చేవూరు జనార్ధన్ రెడ్డి, ముడి కిషోర్ రెడ్డిలు స్పష్టం చేశారు. మహిళలకు పలు రకాల ఆరోగ్య సమస్యలపై టెస్టులు నిర్వహించారు. అంగన్వాడి కార్యకర్తలు గర్భవతులు, బాలింతలు, కౌమార బాలికలకు, వయోవృద్ధులకు పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి శ్రీలక్ష్మి, బిజెపి మండల కార్యదర్శి కాసుల కొండలరావు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వంటేరు రాకేష్ రెడ్డి, టిడిపి నాయకులు గోసల శివకుమార్ రెడ్డి, వల్లూరు మాల్యాద్రి, బీజేపీ మండల కార్యదర్శి పి.సాయి కృష్ణ మహిళలు పాల్గొన్నారు.

## బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి 4 (స్వర్ణాంధ్ర విజన్ 2047) లక్ష్యంగా పేదరిక నిర్మూలన చేయాలని దిశగా అడుగులు వేయడం జరుగుతుందని, ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి తెలియచేశారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి పి4 మొబైల్ యాప్ గురించి ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. సచివాలయ ఉద్యోగులను బంగారు కుటుంబాలకు, పేదలకు మధ్య అనుసంధాన కర్తలుగా నియమిస్తూ, పేదలను గుర్తించి బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దే విధంగా పనిచేయడం పి ఫోర్ యొక్క ప్రధాన ఉద్దేశం అన్నారు. ఇప్పటికే కొన్ని బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు, వారిని వీరికి అనుసంధానం చేస్తూ వారి అవసరాలను తీర్చే విధంగా పనిచేయడమే రాష్ట్ర ప్రభుత్వం యొక్క లక్ష్యం అన్నారు. వారి అవసరాలనూ తీర్చిన వెంటనే యాప్‌లో పొందుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి కె.రామారావు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన ఎంపీడీఓగా బాధ్యతల స్వీకరణ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండల నూతన ఎంపీడీఓగా బి.శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈయన ప్రకాశం జిల్లా మార్కాపురం డిప్యూటీ ఎంపీడీఓగా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడ నియమించబడ్డారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ అప్పాజి చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

## శాసనమండలిలో వైద్య విద్యార్థుల కోసం

# ఆరోగ్య శాఖ మంత్రితో పోరాడిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఇతర దేశాలలో వైద్య విద్యను పూర్తిచేసిన మన రాష్ట్రానికి చెందిన 700 మంది విద్యార్థులకు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నందున శాసనమండలిలో బుధవారం వారి తరుపున ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య విద్యను పూర్తి చేయాలని ఎంతో మంది విద్యార్థులు కలలు కంటుంటారని ఈ క్రమంలో కొంత మంది విద్యార్థులు మన రాష్ట్రంలో వైద్య విద్యకు సంబంధించి సీట్లు తక్కువగా ఉండటం మూలంగా ఇతర దేశాలకు వెళ్లి చదువుకోవడం అందరం చూస్తున్నామ న్నారు. ఇలా ఇతర దేశాల్లో వైద్య విద్యను అభ్యసించే వారి సంఖ్య ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా ఎక్కువగానే ఉందన్నారు. ఇదే క్రమంలో మన రాష్ట్రానికి చెందిన 700మంది విద్యార్థులు ఇతర దేశాల్లో వైద్య విద్యను పూర్తి చేసుకొని పర్మినెంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ లభించక ఎన్నో ఇబ్బందులు పడుతూ కోర్టులు చుట్టూ తిరుగుతూ రోడ్లమీదకి వచ్చి ఏ విధంగా ధర్నాలు చేస్తున్నారో మనందరం చూస్తున్నామని ఇది ఎంతో బాధాకరమన్నారు. అయితే ఇలా ఫారెన్ నుంచి వైద్య విద్యను పూర్తి చేసిన విద్యార్థులు ఇండియాకు వచ్చిన తర్వాత ఎఫ్ఎంజీఈ పరీక్ష రాసి ఏడాది పాటు ఇంటెన్షిప్ కోర్స్ పూర్తి చేసి పర్మినెంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుందన్నారు. అయితే కోవిడ్ ప్యాండమిక్ సమయంలో విదేశాల్లో వైద్య విద్యను అభ్యసిస్తున్న 700మంది విద్యార్థులు మన దేశానికి వచ్చేయడం జరిగిందన్నారు. ఇలా వచ్చిన విద్యార్థులందరికీ ఆన్‌లైన్ తరగతులకు అర్హత ఉంటుందని నేషనల్ మెడికల్ కౌన్సిల్ చెప్పిందన్నారు. కోవిడ్ ముగిసిన తర్వాత వారందరికీ నేరుగా తరగతులు నిర్వహించాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్ పేర్కొందని ఆ విధంగా విద్యార్థులు కూడా తరగతులు పూర్తి చేశారని తెలిపారు. అక్కడ చదువుకున్న విద్యార్థులు అందరూ విజయవంతంగా వైద్య విద్యను పూర్తి చేసినట్టుగా అక్కడ విద్యాసంస్థలు సర్టిఫికెట్ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా లేని విధంగా నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఒక రూల్ పాస్ చేసిందని కోవిడ్ సమయంలో విద్యార్థులు ఒక సంవత్సరం చదువ లేక పోయారుని కనుక ఒక సంవత్సరం అదనంగా వైద్య విద్యను అభ్యసించాలని రూల్ పెట్టిందని చెబుతున్నారు. కానీ వాస్తవంగా ఎన్ఎంసి చెప్పింది ఒక సంవత్సరం తరగతులు నిర్వహించమని కాదని విద్యార్థులు మిస్ అయిన తరగతులు మాత్రమే నిర్వహించాలని తెలిపిందన్నారు. కానీ అవేమీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా రెండేళ్లు కానీ, మూడేళ్లు కానీ ఇక్కడ తిరిగి మీరు వైద్య విద్యను అభ్యసించాల్సి ఉంటుందని చెప్పడం దారుణమన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వైద్య విద్యను పూర్తి చేసి కూడా ఎంతోమంది విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అరుణ్‌సాయి అనే విద్యార్థి ఇంటెన్షిప్‌కు ఏపీలో దరఖాస్తు చేసుకుంటే 2 సంవత్సరాలు కోర్సు చేయాల్సి ఉంటుందని చెప్పగా అదే తెలంగాణలో అప్లై చేసుకుంటే ఏడాది మాత్రమే కోర్సు పూర్తి చేస్తే సరిపోతుందని తెలియజేయడంతో విద్యార్థులు అయోమయంకి గురవుతున్నారని తెలిపారు. అలాగే చామల్య వైష్ణవి అనే విద్యార్థికి మన దగ్గర మూడు సంవత్సరాలు చదవాలని లెటర్ ఇవ్వగా ఇదే విద్యార్థికి కర్ణాటక సిద్ధగంజ కళాశాలలో ఏడాది మాత్రమే చదివితే సరిపోతుందని చెప్పిన లెటర్స్‌ను శాసనమండలి సాక్షిగా సభకు అందజేశారు. ఇలా మన రాష్ట్రానికి చెందిన అర్చన, మోనిషా అనే విద్యార్థులు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో ఏడాది మాత్రమే తరగతులు పూర్తిచేసి పర్మినెంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పొందిన వివరాలను శాసనమండలికి అందజేశారు. ఏపీలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కోర్టు కూడా ఈ విషయంలో విద్యార్థులకు బాసటగా కోవిడ్ ప్యాండమిక్ సమయంలో ఉన్న రూల్స్‌ను బేస్ చేసుకుని విద్యార్థులకు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని తెలిపిందన్నారు. అధికారులు కోర్టు ఆర్డర్‌ను పట్టించుకోకుండా 2021 తర్వాత వచ్చిన రూల్స్‌ను మాత్రమే పరిగణలోకి తీసుకొని విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ తప్పును కప్పిపుచ్చుకునే విధంగా ఆనాటి పరిస్థితుల్లో ఏడాది మాత్రం సరిపోతుందని మేము ఆర్డర్స్ ఇచ్చాము కానీ మారిన రూల్స్‌కు అనుగుణంగా విద్యార్థులు రెండు సంవత్సరాలు తప్పనిసరిగా ఇంటెన్షిప్ కోర్స్ పూర్తిచేయాలని ఆర్డర్ కాపీలో పేర్కొనడం దుర్మార్గమన్నారు. వైద్య విద్యార్థులకు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఇచ్చే విషయంలో ఆంధ్రప్రదేశ్‌లో అధికారులు ఎక్కడో తప్పు చేస్తున్నారని ప్రభుత్వం దాన్ని సరిదిద్ది 700మంది వైద్య విద్యార్థులకు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# నూతన అంగన్వాడి భవనం ప్రారంభం

- జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ చేతుల మీదుగా ప్రారంభం
- ఎన్నికలవేళ మాత్రమే రాజకీయ జెండా అజెండాలు
- ఎన్నికలు లేనివేళ అధికారం ప్రతిపక్షం అని తేడా లేకుండా అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యులు కావాలి : ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం 12వ డివిజన్, చింతారెడ్డి పాలెంలో 26 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క చింతారెడ్డి పాలెం గ్రామ అభివృద్ధి పనులకు కోటి రూపాయలు నిధులు కేటాయించడం జరిగిందని తెలియజేశారు. అలాగే చింతారెడ్డిపాలెం గ్రామానికి అంగన్వాడీ భవనం ఇంత చక్కగా ప్రజలకు మేలు చేసే రీతిలో రావడానికి



జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ ఎంతో కృషి చేయడం జరిగిందని తెలియజేశారు. అదేవిధంగా చింతారెడ్డిపాలెం గ్రామానికి అంగన్వాడి భవన నిర్మాణానికి 16లక్షల రూపాయలు ఎంపీ నిధులు ఇచ్చిన నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ.. చింతారెడ్డిపాలెంలోని నూతన అంగన్వాడి భవన నిర్మాణానికి 16లక్షల రూపాయలు ఎంపీ నిధులు ఇచ్చిన నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా జిల్లా ప్రజా పరిషత్ నిధుల నుండి 10లక్షలు చింతారెడ్డిపాలెంలోని నూతన అంగన్వాడి భవనానికి కేటాయించడం జరిగిందని తెలియజేశారు. అదే విధంగా నూతన అంగన్వాడి భవనం ప్రారంభోత్సవంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని తెలియజేశారు. అదేవిధంగా చింతారెడ్డిపాలెంలో చిన్నపిల్లలకు, బాలింతలకు, గర్భవతులకు ఈ నూతన అంగన్వాడి భవనం ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ నెల్లూరు సిడిపిఓ టి.అరుణ, సూపర్వైజర్లు, అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు గ్రామ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ధైర్య లక్ష్మిదేవిగా భక్తులకు దర్శనం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం దేవరపాలెంలో వేదగిరి క్షేత్రం నరసింహకొండపై వేంచేసియున్న వేదగిరి లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానంలో దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి తెలిపారు. ఈ సందర్భంగా దసరాలలో మూడవ రోజు బుధవారం ఆశ్వీయుజ శుద్ధ తదియ రోజున ఆదిలక్ష్మి అమ్మవారు ధైర్య లక్ష్మిదేవిగా విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా దేవస్థాన ముఖ్య అర్చకులు అర్చకం మాధవగిరి భాస్కరాచార్యులు కలశ పూజ, విశేష కుంకుమార్చన నిర్వహించారు. దేవస్థానం ఉభయ కర్తృత్వంలో నిర్వహించిన ధైర్య లక్ష్మి అలంకార సేవలో కార్యనిర్వహణాధికారి, భక్తులు, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులందరికీ తీర్థ, ప్రసాదాలు వితరణ చేశారు. భక్తులందరికీ అన్నదానం పథకంలోని అన్న ప్రసాదాలు వితరణ జరిగింది. గురువారం ఆదిలక్ష్మి అమ్మవారు గజలక్ష్మి అలంకారంలో దర్శనమివ్వనున్నారు.

## అన్నపూర్ణదేవి అలంకరణలలో అమ్మవార్లు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు బుధవారం ఆలయాల్లో అమ్మవార్లు విశేషఅలంకరణలలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా సంతాన లక్ష్మి ఆలయంలో అమ్మవారు. పార్వతి పరమేశ్వర ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణ దేవిగా, భక్తులకు దర్శనం ఇచ్చారు. వేకువ జాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి కాయకర్పూర నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

## నూతన ఎంపీడీఓని కలిసిన కూటమి నాయకులు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా సైదాపురం మండల కేంద్రంలో నూతన ఎంపీడీవో ఎంవి మోహన్‌రెడ్డిని బుధవారం స్థానిక టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో రవీంద్రబాబు పదోన్నతపై తిరుపతి జిల్లా దక్కిలి మండలానికి బదిలీ అయ్యారు. అనంతరం ప్రకాశం జిల్లా కనిగిరి మండలంలో డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేస్తున్న ఎంవీ మోహన్‌రెడ్డి బుధవారం సైదాపురం మండలంలో ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎంపీడీఓ రాకతో మండలంలోని కూటమి నాయకులు నాయకులు పూలమాల శాలువాతో సత్కరించారు. సైదాపురం మండలంలో సమస్యలు పరిష్కారానికి తమ సహాయ సహకారాలు అందించాలని స్థానిక టిడిపి నాయకులు నూతన ఎంపీడీఓను కోరారు. సానుకూలంగా స్పందించిన నూతన ఎంపీడీవో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు అమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు టిడిపి కూటమి నాయకులు, ఎస్సీ సెల్ అధ్యక్షులు రమేష్, మండల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు, ఏఎంసి డైరెక్టర్ రాఘవరెడ్డి క్లస్టర్ ఇన్‌చార్జ్ విజయ్‌రెడ్డి ఇది ఇతరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన చల్లా



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ బుధవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సొసైటీ అభివృద్ధికి తగిన విధంగా సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే ప్రభుత్వంలో రైతుకు అవసరమైన సేవలను అందించే విధంగా సహాయం అందించాలని కోరారు.